


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -8 బుధవారం 3 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -6 వెల - 5/-





Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# ప్రజాకాంక్షలు నెరవేరుస్తాం

## ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహణ**

**అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన సీఎం**



- తెలంగాణ కోటి రత్నాలవీణ
- త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల
- టీజీపీఎస్సీ ద్వారా విడుదల చేస్తాం
- జాబ్ నోటిఫికేషన్ల జారీ నిరంతర ప్రక్రియ
- న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ
- 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం
- నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..
- కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం
- నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం
- రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు
- నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు
- ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి





**హైదరాబాద్, జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిఫికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శు భాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ మిగతాది 2లో...

# మూడో దేశం జోక్యం కుదరదు




**నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన**

- భారత్-నేపాల్ సరిహద్దు వివాదంలో మూడో దేశం జోక్యం కుదరదని స్పష్టం చేసిన భారత్
- ఇది పూర్తిగా ద్వైపాక్షిక అంశమని భారత విదేశాంగ శాఖ వెల్లడి
- భారత్, నేపాల్ పరస్పరం భూభాగాలు ఆక్రమించుకున్నాయన్న నేపాల్ ప్రధాని వ్యాఖ్యలు
- ద్వైపాక్షిక చర్చలకే కట్టుబడి ఉన్నామని భారత్ స్పష్టీకరణ

**జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** భారత్, నేపాల్ మధ్య ఉన్న సరిహద్దు వివాదం పూర్తిగా ద్వైపాక్షిక అంశమని, ఇందులో మూడో దేశం ప్రమేయానికి ఆస్కారమే లేదని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలను చర్చల ద్వారా, చారిత్రక ఆధారాల ప్రాతిపదికన పరిష్కరించుకోవాలని పేర్కొంది.నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల పార్లమెంటులో చేసిన మిగతాది 2లో...

# బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

**తదుపరి కొత్త పార్టీ ఏర్పాటుపై దృష్టి**

**సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ!!**



**కోయంబత్తూరు,జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎస్ మాజీ అధికారి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే. అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను కలిసి తన 5 పేజీల రాజీనామా లేఖను సమర్పించారు. కొద్ది రోజులుగా అన్నామలై తదుపరి అడుగులపై సాగుతున్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. గత ఆరేళ్లుగా తమిళనాట బీజేపీకి 'స్టార్' ఇమేజ్ తెచ్చిన అన్నామలై, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన పార్టీ కేంద్ర నాయకత్వంతో తనకు ఉన్న వ్యూహాత్మక విభేదాలను స్పష్టంగా మిగతాది 2లో...

# బంగారం రీసైకిల్ చేద్దాం

**: ప్రధాని మోదీ పిలుపు**

**బంగారం దిగుమతులు తగ్గించి విదేశీ మారక నిల్వలను కాపాడటమే లక్ష్యం**

**ఒక శాతం బంగారం రీసైకిల్ చేసినా దిగుమతులు 30% తగ్గుతాయని నిపుణుల అంచనా**





2లో.

# అకాల వర్షాలతో రైతులు కన్నీరు

**తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం**

**ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు**



**హైదరాబాద్,జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** ఆరుగాలం కష్టపడి పండించిన పసిడిపంట చేతికొచ్చే సమయానికి అన్నదాతను ప్రకృతి పగబట్టి ఆడుకుంటోంది. ఉదయం పూట భగభగ మండుతున్న ఎండలు కమ్మేస్తుంటే.. రాత్రి కాగానే విరుచుకుపడుతున్న కారుమబ్బులు, భయపెడుతున్న ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాతావరణం పూర్తిగా అతలాకుతలమైంది. పగలు దంచికొడుతున్న ఎండల తీరు ఒకలా ఉంటే రాత్రివేళ ముంచుకొస్తున్న అకాల వర్షాలు రైతన్నల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మిగతాది 2లో...

# ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

- జనసేన పుట్టిందే తెలంగాణలో
- అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది
- తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చకున్నా
- తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం
- తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు
- తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే
- తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం
- ఎవరి తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు
- మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ



**హైదరాబాద్,జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** : తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. మిగతాది 2లో...




2లో.

# భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ!

**: కేంద్రం కీలక అడ్వైజరీ**

- అంతర్జాతీయ ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య శాఖ మార్గదర్శకాలు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో అప్రమత్తత
- ఈ వైరస్‌కు టీకాలు లేకపోవడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన

# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

**పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ**

**తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్**



**హైదరాబాద్,జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ మిగతాది 2లో...

# ప్రజాకాంక్షలు నెరవేరుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళున్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శు



భాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు. నల్గొండ కేవలం జిల్లా కాదని విప్లవాల పురిటి గడ్డ, అన్యాయంపై తిరగబడ్డ వీరుల అడ్డా అని వెంకట్?రెడ్డి చెప్పారు. నా భూమి జోలికొస్తే ఆ భూమిలోనే నీ గోరి కడతాం అని దొరల గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. నల్గొండ గడ్డ మన పిల్లలు లాఠీ దెబ్బలు తింటే, శ్రీకాంతాచారి తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేదని అన్నారు. తానెప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరకపోతే ఈ పదవులు ఎందుకని నాడు మంత్రి పదవిని విసిరికొట్టి ఉద్యమంలోకి దిగిన చరిత్ర తనదన్నారు.

## బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించినట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తో పొత్తు పెట్టుకోవాలన్న దిల్లీ పెద్దల నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని తాను కోరుకుంటే, అధిష్ఠానం మాత్రం ద్రావిడ పార్టీలపై ఆధారపడటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపులో అన్నామలై అభిప్రాయాలను కేంద్ర నాయకత్వం పక్కన పెట్టింది. తనకు కేవలం ఆరు స్థానాల బాధ్యతలు మాత్రమే అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. ఫలితంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం, పార్టీ ఘోర పరాజయం పాలుకావడంతో అన్నామలై వాదన నిజమైంది. బీజేపీలో తనకు తగినంత స్వేచ్ఛ, భవిష్యత్తు లేవని భావించిన ఆయన, సుదీర్ఘ చర్చల అనంతరం కమలం గూటి నుంచి బయటకు రావడమే ఉత్తమమని భావించారు. అన్నామలై రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదు, పైగా మరింత దూకుడు పెంచబోతున్నారు. రాబోయే ఉపఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా లేదా సరికొత్త వేదిక ద్వారా పోటీ చేసేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. రాబోయే 6 నుంచి 8 నెలల కాలంలో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించే యోచనలో ఆయన ఉన్నారు. తమిళ అస్థిత్వం – జాతీయ దృక్పథం అనే సరికొత్త స్లోగన్‌తో, ఒక సెక్యులర్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయడమే ఆయన తదుపరి కార్యాచరణగా తెలుస్తోంది. ప్రముఖ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం చేసి ఘనవిజయం సాధించడంతో తమిళనాడు రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ద్రావిడ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకే , బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఒక కొత్త శక్తి వైపు యువత మొగ్గు చూపుతోందని అన్నామలై గమనించారు. బీజేపీ సిద్ధాంతాల ముద్ర వల్ల తమిళనాడులో ఎదగడం కష్టమని గ్రహించిన ఆయన, విజయ్ తరహాలోనే ద్రావిడ సంస్కృతి, అవినీతి రహిత పాలన అజెండాతో యువతను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే పలువురు యువ నిపుణులు, అసంతృప్త నేతలు ఆయనతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. తమిళనాడు బీజేపీకి అన్నామలై రాజీనామా చేయడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బే. ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ యువనేత, ఇప్పుడు బీజేపీ చట్రం నుంచి బయటకు వచ్చి ఒంటరి పోరాటానికి సిద్ధమయ్యారు. కోయంబత్తూరుతో సహా తమిళనాడు అంతటా ఆయన మద్దతుదారులు ఇప్పటికే అన్నామలై 2.0 పోస్టర్లతో హల్‌చల్ చేస్తున్నారు. మరి ఈ సింగం సొంతంగా పార్టీ పెట్టి ద్రావిడ కోటలను బద్దలు కొడుతుందో లేదో చూడాలి.

## భారత్‌లో ఎబోలా కేసులు లేవు.. కానీ! : కేంద్రం కీలక అడ్వైజరీ

జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):

గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు తమ ఆరోగ్యాన్ని స్వయంగా పర్యవేక్షించుకోవాలని సూచించింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని సూచించింది. జ్వరం, తీవ్రమైన బలహీనత, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలు, దద్దుర్లు లేదా కారణం లేకుండా రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరింది. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలను కాపాడుకోవడంతోపాటు వ్యాధి వ్యాప్తిని కూడా నిరోధించవచ్చని తెలిపింది. అధికారుల సాయం కోసం హెల్ప్ లైన్ నెంబర్ 1075కు కాల్ చేయాలని సూచించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో కొత్త రకం ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) మే 17న దీనిని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. ఈ ప్రత్యేక వైరస్‌కు ప్రస్తుతం ఆమోదిత టీకాలు లేదా నిర్దిష్ట చికిత్సలు అందుబాటులో లేకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెంచుతోంది.

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

సన్మానం చేశారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే విజయం సాధించిందని, 2023 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం రాష్ట్రాన్ని వెనక్కి నెట్టే విధంగా పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తూ.. గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. 'వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ అన్నారు. అయితే ఈ పరిస్థితులు శాశ్వతం కాదని, 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బంగారం రీసైకిల్ చేద్దాం : ప్రధాని మోదీ పిలుపు

జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఒక కీలక పిలుపునిచ్చారు. కొత్తగా బంగారం దిగుమతి చేసుకునే బదులుగా ఇళ్లలో, దేవాలయాల్లో నిరుపయోగంగా ఉన్న బంగారాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

ఈ విధానం ద్వారా బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఉత్పత్తి చాలా స్వల్పం. ఈ కారణంగా ఏటా బిలియన్ల కొద్దీ డాలర్లను వెచ్చించి బంగారాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో మన దేశం సుమారు 72.4 బిలియన్ డాలర్ల విలువైన బంగారాన్ని దిగుమతి చేసుకుంది. ఇది ముడి చమురు తర్వాత దేశ దిగుమతి బిల్లులో అతిపెద్దది. బంగారం దిగుమతులకు చెల్లింపులు యూఎస్ డాలర్లలో చేయాల్సి రావడం వల్ల, రూపాయి విలువపై ఒత్తిడి పెరిగి, కరెంట్ అకౌంట్ లోటు విస్తరిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారంగానే ప్రధాని రీసైక్లింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. అంచనాల ప్రకారం ప్రస్తుతం దేశంలోని గృహాలు, దేవాలయాల్లో దాదాపు 30,000 నుంచి 32,000 టన్నుల బంగారం నిరుపయోగంగా ఉంది. ఈ పాత ఆభరణాలు, నాణేలు, మరియు ఇతర బంగారు వస్తువులను కరిగించి, శుద్ధి చేసి, 99.9% స్వచ్ఛమైన బంగారంగా మార్చవచ్చు. ఈ బంగారాన్ని తిరిగి కొత్త ఉత్పత్తుల తయారీకి ఉపయోగించడం వల్ల దిగుమతుల అవసరం తగ్గుతుంది. రీసైక్లింగ్ విధానం ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగకరం

పరిశ్రమ నిపుణులు సైతం ప్రధాని ప్రతిపాదనను సమర్థిస్తున్నారు. ముత్తూట్ ఎగ్జిమ్ సీఈఓ కీయూర్ షా అంచనా ప్రకారం దేశంలో ఉన్న మొత్తం బంగారంలో కేవలం 1% ఏటా రీసైక్లింగ్‌కు వచ్చినా, మన దిగుమతులు 25 నుంచి 30 శాతం వరకు తగ్గుతాయి. స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ పరిశోధన హెడ్ సంతోష్ మీనా మాట్లాడుతూ, వ్యవస్థీకృత రీసైక్లింగ్ విధానం విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించడమే కాకుండా వాణిజ్య లోటును నియంత్రించి, దేశాన్ని ఆత్మనిర్భర్ దిశగా నడిపిస్తుందని వివరించారు. ప్రధాని పిలుపును జ్యువెలరీ సంఘాలు స్వాగతించాయి. పాత బంగారాన్ని మార్చుకునే వారికి తక్కువ తరుగుతో కొత్త డిజైన్లు అందించే కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించాయి. మరోవైపు బంగారం ధరలు రికార్డు స్థాయిలో ఉండటంతో వివాహాలు, ఉన్నత విద్య వంటి అవసరాల కోసం పాత నగలను మార్చుకోవడం వినియోగదారులకు కూడా లాభదాయకంగా మారింది. మొత్తంమీద దిగుమతి చేసుకునే వినియోగదారుగా కాకుండా, దేశంలో ఉన్న వనరులనే సమర్థంగా వాడుకునే ఆర్థిక వ్యవస్థగా మారాలనేది ఈ పిలుపు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.

## అకాల వర్షాలతో రైతులు కన్నీరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకృతి కన్నెర్ర చేయడంతో స్వేదం చిందించి పండించిన ధాన్యం రాశులు కళ్ల ముందే తడిసిపోతుంటే ఆ దృశ్యాలు చూసి కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులు జిల్లావ్యాప్తంగా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

కల్లాల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన కర్షకులు చెప్పనలవికాని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పగలు రాత్రి కష్టపడి సాధించిన దిగుబడులను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి మార్కెట్ యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కల్లాల వద్ద, రోడ్ల పక్కన కుప్పలు పోసిన ధాన్యం వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. రోడ్లపైనే వరి కుప్పలు భారీగా పేరుకుపోవడంతో అటు వాహనదారులకు సైతం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. గత రెండు మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని సాత్నాల, బేలా, జైనథ్, భోరజ్ మండలాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మార్కెట్ కేంద్రాల వద్ద ఆరుబయట నిల్వ ఉంచిన ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు వాగుల్లా ప్రవహించడంతో వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా తాంసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ ఆరబోసిన జొన్న పంటతో, నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులతో కిటకిటలాడుతోంది. కంటికి రెప్పలా కాపాడుకున్న జొన్న కుప్పలు అడపాదడపా కురుస్తున్న వానలకు తడిసిపోతుండటంతో వాటిని పదేపదే ఎండబెట్టుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తూ అలిసిపోతున్నారు. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగడానికి ప్రధానంగా గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత కారణమని స్పష్టమవుతోంది. నిండిన బస్తాలను తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడం, తూకాలు వేసేందుకు తగినంత మంది కూలీలు దొరకకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం పదిహేను ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల క్వింటాళ్ల వరిని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోవడంతో వారం రోజులు గడిచినా రైతుల నిరీక్షణ యథాతథంగా కొనసాగుతూనే ఉంది. బస్తాల కొరత అన్నదాతల పాలిట పెను శాపంగా మారింది. క్షణం క్షణం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతుల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తున్నాయి. పగలు ఎండకు ఎండుతూ, రాత్రి వానకు తడుస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్న కర్షకులు చివరికి తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. వాన ఎప్పుడు ముంచుకొస్తుందో, గాలి దుమారం ఎప్పుడు కమ్ముకొస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించాలని వారు వేడుకుంటున్నారు. లారీలు, గోనెసంచులు తగినన్ని అందుబాటులో ఉంచి, నిబంధనలు సడలించి తడిసిన పంటను సైతం వెంటనే కొనుగోలు చేసి తమను తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007–08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వైసీపీ తనను ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టనివ్వనంటే ఈ ప్రాంతం ఆదరించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోనే తాను అధికారం కోరుకోలేదన్నారు.

## బయ్యారం ఫారెస్ట్ రేంజ్ అధికారిగా రవి కిరణ్ బాధ్యతలు.



**బయ్యారం/,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం ఫారెస్ట్ రేంజ్ అధికారిగా పుప్పాల రవి కిరణ్ బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.ఇక్కడ పనిచేసిన సువర్చల ములకలపల్లి ఫారెస్ట్ రేంజ్ కు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.ఈ సందర్భంగా రేంజ్ అధికారి మాట్లాడుతూ గతంలో నర్సంపేట ఫారెస్ట్ రేంజ్ అధికారిగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.అటవీ,వన్య వన్యప్రాణుల సంరక్షణ కొరకు ప్రత్యేక చర్యలను తీసుకోనున్నట్లు తెలిపారు.ఎవరైనా వన్యప్రాణులు వేటాడితే చర్యలు తీసుకుంటామని,వన్య ప్రాణులను వేటాడే వారి సమాచారాన్ని ఇవ్వాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచి వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. పోడు వ్యవసాయం అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను ఆమలు చేయనున్నట్లు తెలిపారు.

## బయ్యారం సొసైటీలో తెలంగాణ తల్లికి అవమానం

### -జయశంకర్ ఫోటోతో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు.



**బయ్యారం/,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ప్రభుత్వ కార్యాలయాలలో ప్రధాన పార్టీ నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు.తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా అధికారిక ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం..తెలంగాణ తల్లి విగ్రహానికి,లేదా ఫొటోకి పూలమాలలు వేసి దండలు వేయాలి.తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా భావించే తెలంగాణ తల్లికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు.కానీబయ్యారం సొసైటీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం లేకుండానే జయశంకర్ ఫోటోతో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సొసైటీ సీఈవో సురేందర్ నిర్వహించడంపై,వేడుకలకు హాజరైన పలువురు పలు రకాలుగా చర్చించుకున్నారు.దీనిపై సొసైటీ చైర్మన్,సిబ్బంది,పలువురు డైరెక్టర్లు, రైతులు సోసైటీ సిఈవో పై ఆగ్రహం వ్యక్తం చేశారు..

## ఇల్లంద మార్కెట్ యార్డులో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



**వర్ధన్నపేట/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వర్ధన్నపేట (ఇల్లంద) వ్యవసాయ మార్కెట్ యార్డులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సిద్ధాంతకర్తలకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో సాధిస్తున్న ప్రగతిని కొనియాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ యార్డులో మరిన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సిరికొండ కృష్ణా రెడ్డి, డైరెక్టర్లు బచ్చు గంగాధర్ రావు, మల్యాల దేవేందర్, కర్ర మాలతి రెడ్డి, ఎండీ మహమ్మద్, ఎండీ ఖాజా బాయ్, అల్లా కొమురయ్య, ఖాటాబోయిన సంపత్, బండి సంపత్, అంగోత్ నాను నాయక్, పుల్లూరి దామోదర్, పాబ్బతి సంపత్ లతో పాటు మార్కెట్ యార్డు సిబ్బంది, స్థానిక రైతులు, హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## తల్లాడలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు..

### ఉద్యమకారుడు ప్రసాద్ బాబుకు సత్కారం



**తల్లాడ/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తల్లాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు, అంబేద్కర్ కమ్యూనిటీ సాధన కమిటీ ఉపాధ్యక్షుడు నారపోగు ప్రసాద్ బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ అనేది కేవలం ఒక భూభాగం మాత్రమే కాదని, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న ఆకాంక్ష అని పేర్కొంటూ రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న సోషల్ సర్వీస్ టీం సభ్యులను, జిల్లా నాయకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. అనంతరం సమాజ సేవలో నిరంతరం ముందుంటున్న నారపోగు ప్రసాద్ బాబును, అలాగే రవి, రాజులను సోషల్ సర్వీస్ టీం సభ్యులు, స్థానిక నాయకులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, సంస్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హాల్ సాధన కమిటీ సభ్యులు, వార్ టీం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పచ్చని చెట్లకు గొడ్డలి వేటు..

## గొల్లగూడెంలో 13 ఏళ్ల నాటి వృక్షాల నరికివేత





**తల్లాడ/జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** ఒకవైపు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం హరితహారం అంటూ మొక్కలు నాటాలని పిలుపునిస్తుంటే, మరోవైపు తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామంలో 13 ఏళ్ల నాటి పచ్చని చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేశారు. నాడు మండల అధికారుల ఆదేశాల మేరకు గ్రామస్తులు ఎంతో ప్రయాసపడి పెంచి పెద్ద చేసిన ఈ వృక్షాలు. బాటసారులకు, స్థానికులకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని పంచేవి. అయితే, గ్రామస్తులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, కనీసం ఉన్నతాధికారుల అనుమతి కూడా తీసుకోకుండా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పంచాయతీ సెక్రెటరీ జిలేల కవిత కలిసి ఈ పెద్ద చెట్లను కూల్చివేయడం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారుల తీరుపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు నాటాలనే నినాదం కేవలం మాటలకే పరిమితమా అని నిలదీస్తున్నారు. ఈ అక్రమ నరికివేతపై వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొండేటి వీరారెడ్డి, స్థానిక వార్డు సభ్యులు, నాయకులు కలిసి ఫారెస్ట్ రేంజర్ ఉమా, ఎంపీడీవో శ్రీధర్ రాజుకు ఫిర్యాదు చేశారు. పచ్చని ప్రకృతిని ధ్వంసం చేసిన బాధ్యులపై విచారణ జరిపి, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## త్యాగాల పునాదులపైనే తెలంగాణ సిద్ధించింది : డాక్టర్ కె.వి.కృష్ణారావు



**ఖమ్మం/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలు, మేధావుల మేధోమథనం ఫలితంగానే స్వరాష్ట్రం సిద్ధించిందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి.కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్స్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఫోరం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాలే మూలంగా 1969 నుంచి 2014 వరకు నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన అలుపెరగని పోరాటాన్ని గుర్తుచేశారు. తొలి, మలిదశ ఉద్యమాల్లో వందలాది మంది చేసిన ఆత్మబలిదానాల పునాదులపైనే ఈ ఆత్మగౌరవ రాష్ట్రం ఏర్పడిందన్నారు.
తొలితరం ఉద్యమకారుడు ప్రకాష్ కుమార్ జైన్, మలిదశ అమరవీరులు శ్రీకాంతాచారి, ఈశాన్‌రెడ్డి, యాదిరెడ్డిల త్యాగఫలితమే నేటి తెలంగాణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, ప్రతినిధులు తవిడిశెట్టి రామారావు, గుంతేటి వీరభద్రం, పగడాల నరేందర్, బచ్చల పద్మాచారి, నెలవెల్లి వెంకటేశ్వరావు, షేక్ అబ్బాస్, బత్తిన మధుగౌడ్, రెడ్డబోయిన వరలక్ష్మి, గ్లోరి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

# వంగర పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక వృద్ధుల ఆరోగ్య శిబిరం

## వైద్య సేవలతో పాటు భోజన సదుపాయం.. వృద్ధుల మనసు గెలిచిన పోలీసులు





**భీమదేవరపల్లి/జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, వంగర ఎస్ఐ దివ్య, ఎల్కతుర్తి ఎస్ఐ, ముల్కనూర్ ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో వృద్ధులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్, దంత వైద్య, స్త్రీరోగ, ఛాతీ వ్యాధుల నిపుణులు, నేత్ర వైద్యులు పాల్గొని వృద్ధులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు రక్త పరీక్షలు చేసి, తదుపరి చికిత్స అవసరమైన వారిని ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేశారు. ప్రస్తుతం నెలకొన్న ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా నడవలేని వృద్ధులు, వికలాంగులను ముల్కనూర్ ఎస్ఐ రాజు స్వయంగా సహాయం చేసి శిబిరానికి తీసుకురావడం పలువురిని ఆకట్టుకుంది. శిబిరానికి వచ్చిన వృద్ధులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. వేచి ఉండే సమయంలో వారికి వినోదంతో పాటు భావోద్వేగ అనుబంధాన్ని కలిగించేలా "బలగం" చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే ప్రతి ఒక్కరికీ భోజన సదుపాయం కల్పించి తమ మానవతా దృక్పథాన్ని చాటిచెప్పారు. మంచినీటి సదుపాయం నుంచి వైద్య సేవల సమన్వయం వరకు ప్రతి ఏర్పాటును క్రమబద్ధంగా నిర్వహించి శిబిరాన్ని విజయవంతం చేయడంలో పోలీసు సిబ్బంది విశేషంగా కృషి చేశారు. ప్రజలకు భద్రత కల్పించడమే కాకుండా సేవాభావంతో అండగా నిలవడమే ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిజమైన నిర్వచనమని ఈ కార్యక్రమం మరోసారి నిరూపించింది. ఈ శిబిరంలో డాక్టర్ శ్రీపాల్ (ఆర్థోపెడిషియన్), డాక్టర్ భరత్ (చెస్ట్ ఫిజీషియన్), డాక్టర్ జ్యోష్న (గైనకాలజిస్ట్), డాక్టర్ అరుణ (ఆఫ్తాల్మాలజిస్ట్), డాక్టర్ జ్యోతి (డెంటల్ సర్జన్), డాక్టర్ రెహమాన్ (క్యాంప్ ఇన్‌ఛార్జ్), డాక్టర్ రుబీనా (పి.ఓ. ఎం.హెచ్.ఎన్) పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎస్ఐ దివ్య మరియు పోలీసు సిబ్బందిని పలువురు అభినందించారు.

## తహసిల్దార్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు



**వర్ధన్నపేట/జూన్ 2 (జర్నలిస్ట్ వార్త)::** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్ధన్నపేట మండల తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ విజయ్ సాగర్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో అమరవీరుల త్యాగాల ఫలంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రం నేడు ప్రగతి పథంలో దూసుకుపోతోందని కొనియాడారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డిప్యూటీ తహసిల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, విలేజ్ రెవెన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## నూతనకల్లులో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**తల్లాడ/జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని నూతనకల్లు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ తెలపుట్ట శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ ఖమ్మం జిల్లా నాయకుడు అడపా అనిల్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం, రైతు వేదిక వద్ద వారు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం అనిల్ చౌదరి మాట్లాడుతూ.. సుదీర్ఘ పోరాటాలు, అమరవీరుల త్యాగాల ఫలమే నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని కొనియాడారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన వీరులను స్మరించుకుంటూ, ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలియజేశారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ శ్రీదేవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తెనాలి సత్యం, సీనియర్ నాయకులు గణేషుల రవి, కల్యాణపు వెంకటయ్య పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు వీరబాబు ముదిరాజ్, బుసనం కృష్ణవేణి, శంకర్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలు



**నర్సంపేట/జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె పట్టణ ప్రజలందరికీ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానిక జెడ్పీహెచ్ఎస్ (బాలుర) ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో జెండా ఎగురవేశారు. ఇదే వేదికపై ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన మొదటి అడ్మిషన్ దరఖాస్తును ఆమె చేతుల మీదుగా స్వీకరించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ . కౌన్సిలర్లు మాదాసి రవి, ముత్తినేని వెంకన్న, ఎలకంటి విజయ్ కుమార్, హనుమకొండ శ్రీధర్, అయూబ్ ఖాన్, వేముల సంధ్యారాణి, కొత్తకొండ మేఘన, బాణాల ప్రసన్న, శ్రీరామోజు రోజారాణి, పొన్నాల మనీషా, చీకటి స్వరూప, వేల్పుల శ్రీలత, ఇస్లావత్ రమా పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి మున్సిపల్ ఏఈ, శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం సిబ్బంది అభినందనీయమైన కృషి చేశారు.

## ఉప్పలపాడులో వైభవంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..



**బయ్యారం/,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలం ఉప్పలపాడు గ్రామపంచాయతి కార్యాలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.సర్పంచ్ పానుగోతు వెంకన్న నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏళ్లకుఏళ్లుగా సాగిన తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకున్న కవులు,కళాకారులు, విద్యార్థులు,ఉపాధ్యాయులు, ఉద్యోగులు,మేధావులు,జర్నలిస్టులు, న్యాయవాదులు, కార్మికులు, కర్షకులు, మహిళలకు సర్పంచ్ వెంకన్న అభినందనలు తెలిపారు.అన్ని రంగాల్లో ఉప్పలపాడు గ్రామపంచాయతీనీ ఆదర్శంగా నిలిచేలా సరికొత్త విధానాలతో ముందుకు వెళ్తామని సర్పంచ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోడి మమత,గాడిదల కేతమళ్ళ,కోడి చిన్న వీరన్న,వార్డు సభ్యులు,గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు,మహిళా సంఘ సభ్యులు, ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ తీగల వల్ల పంట నష్టం.. రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలి

### ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాదం తిరుపతి




**భీమదేవరపల్లి/జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో కరెంట్ తీగలు ఈదురు గాలుల కారణంగా ఒకదానికొకటి తగిలి అగ్నిప్రమాదం సంభవించి సుమారు 20 ఎకరాల మేర పంటలు దగ్ధమైన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాదం తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కొత్తపల్లి గ్రామ శివారులో జరిగిన అగ్నిప్రమాదంలో పంటలతో పాటు బోరుబావులు, డిప్ పైపులు, పైప్‌లైన్లు, టేకు చెట్లు, గడ్డివాములు, వడ్ల కల్లాలు, వడ్ల సంచులు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు. అలాగే రెండు ఎకరాలకు పైగా ఉన్న మామిడి తోట కూడా అగ్నికి ఆహుతైందన్నారు. ఈ ప్రమాదంతో రైతులకు సుమారు రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే కాలిపోవడంతో రైతులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు కనీసం రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అగ్నిప్రమాద సమయంలో అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ప్రమాదాన్ని పూర్తిగా అదుపులోకి తీసుకురాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక అధికారులు వెంటనే ఘటన స్థలాన్ని పరిశీలించి నష్టపోయిన రైతుల వివరాలు సేకరించి సకాలంలో పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులతో కలిసి దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ముత్తారం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..

### ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్





**భీమదేవరపల్లి/జూన్2 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం మాట్ల హరికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని పేర్కొంటూ, ముత్తారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి శానిటేషన్ మరియు సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులు తమ విధులను సురక్షితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. చివరగా గ్రామ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# త్రివేణి పాఠశాలలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**సత్తుపల్లి/జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** స్థానిక త్రివేణి పాఠశాల సత్తుపల్లి బ్రాంచ్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే జూన్ 2, 2014న తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వారు కలలుగన్న బంగారు తెలంగాణను సాధించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తూ, సురక్షితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సి.ఆర్.ఓ మురళి కృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ప్రాధాన్యతను వివరించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ సరిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సుదీర్ఘ చరిత్రను, రాష్ట్ర సాధనలో ప్రజలు పడిన కష్టాలను, వీరుల త్యాగాలను గుర్తుచేశారు. క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, అకాడెమిక్ ఇన్‌చార్జ్ పవన్, కిడ్స్ ఇన్‌చార్జ్ శ్రీ పద్మలు మాట్లాడుతూ.. తెలంగాణ విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలు మరియు రాష్ట్ర అభివృద్ధి పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ముగింపు వేడుకల్లో భాగంగా అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ నిశ్శబ్దం పాటించారు. రాష్ట్ర ఐక్యత, శాంతి, సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పేరుకే ఉపాధి హామీ..

# లబ్ధి ఇటుక వ్యాపారులకే!



### -చెన్నారావుపేట మండలం కోపాకుల చెరువులో మట్టి అక్రమ రవాణా

### - నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు



**నర్సంపేట/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట మండల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువు మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. మండలంలోని కోపాకుల చెరువులో వంద రోజుల ఉపాధి హామీ పథకం కింద కూలీలతో తవ్వించిన మట్టిని కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం చెరువుల్లో తవ్విన నాణ్యమైన రాగడి మట్టిని స్థానిక రైతుల పొలాలకు తరలించాల్సి ఉంటుంది. లేదా పాడుబడిన బావులను పూడ్చడానికి, గ్రామీణ రోడ్ల మరమ్మతుల కోసం ఈ మట్టిని ఉపయోగించాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. కూలీల కష్టాన్ని, ప్రభుత్వ ఆశయాన్ని కొందరు స్వార్థపరులు తమ లాభార్జన కోసం తుంగలో తొక్కుతున్నారు.

**ఇటుక బట్టీలకు రాగడి మట్టి:**

గ్రామస్తులు ఎంతో కష్టపడి తవ్విన విలువైన రాగడి మట్టిని కొంతమంది దళారులు ఇటుక బట్టీల వ్యాపారులకు గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఈ మట్టి ఇటుక బట్టీలకు తరలిపోతున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడు. స్థానికంగా ఇంత అక్రమ రవాణా జరుగుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించి మట్టిని తరలిస్తున్న వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**ముడుపుల లీలలేనా?**


అక్రమార్కులు యథేచ్ఛగా చెరువులను తవ్వేస్తుంటే అధికారులు మౌనం వహించడం వెనుక అసలు రహస్యమేమిటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటుక వ్యాపారస్తుల నుంచి అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నాయా? లేక 'మాకెందుకులే' అనే ఉదాసీనతతో ఊరుకుంటున్నారా? అని గ్రామస్తులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కూలీల శ్రమ దోపిడీకి గురవుతుంటే, మరోవైపు ప్రభుత్వ సంపద ప్రైవేటు వ్యక్తుల పాలుకావడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కోపాకుల చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని, బాధ్యులైన దళారులు, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డివిజన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సమాచారం ఇవ్వరా?..

## పంచాయతీ కార్యదర్శికి 'సమాచార కమిషన్' నోటీసులు

### - విచారణకు హాజరుకావాలని ఆదేశం.. నేలకొండపల్లి మండలం చెన్నారంలో ఘటన

**ఖమ్మం/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):**
సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తూ, దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వకుండా దాటవేస్తున్న నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే చెన్నారం గ్రామానికి చెందిన ఒక సామాజిక కార్యకర్త 2025 అక్టోబరు 9న ఆర్టీఐ చట్టం ద్వారా గ్రామ పంచాయతీలో జరిగిన ఇళ్ల మ్యూటేషన్ల వివరాలు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. గ్రామంలో ఎన్ని ఇళ్లకు మ్యూటేషన్ చేశారు, ఎవరెవరి పేర్లపై మార్పిడి జరిగిందనే పూర్తి సమాచారాన్ని నిబంధనల ప్రకారం ఇవ్వాలని కోరారు, సదరు పంచాయతీ కార్యదర్శి చట్ట నిబంధనలను బేఖాతరు చేస్తూ సమాచారాన్ని ఇవ్వకుండా దాపరికానికి తెరలేపారు. పైగా, దరఖాస్తుదారుడు చట్ట ప్రకారం అర్హుడైనప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు కట్టాలి అంటూ అర్థంపర్థం లేని సమాధానంతో లేఖ రాసి


TELANGANA INFORMATION COMMISSION
(Under Right to Information Act, 2005)
D.No.5-4-399, Samachara Hakku Bhavan (Old ACB Building), Mojam-Jahi-Market, Hyderabad – 500 001 - Phone: 040-24740667 (Off)

NOTICE

Case No.16455/SIC-PVSR/2025 Date:13-05-2026

Ref:- 1. 6(1) Application dated 09-10-2025 filed before the PIO.
2. 19(1) 1st Appeal dated 13-11-2025 filed before the 1st Appellate Authority.
&&&

Whereas Sri A. Saidulu has filed an appeal U/s 19(3) of the RTI Act, 2005 before this Commission against the Public Authority; and whereas the said appeal is posted for hearing on the 04th day of June, 2026 at 10.00 a.m.

A. The Respondents are hereby directed to appear in person before the Commission in Room No. 204 at Second floor at 10.00 a.m. on the 04th day of June, 2026 along with written affidavits containing:
(i) the action taken (point wise)on 6(1) application / 19(1) appeal.
(ii) copies of information furnished to the appellant and proof of dispatch / receipt / acknowledgement by the appellant.
(iii) point wise counter on the 2nd appeal along with enclosed affidavit duly filled in all respects; and
(iv) the Respondent shall produce a copy of the 4(1) (b) data for the perusal of State Information Commission.

B. The Appellant to attend the hearing on the said date and time along with affidavits containing the:
(i) points for which information is not furnished; and
(ii). Points for which information furnished is unsatisfactory / incorrect / false giving complete justification in support of his claim.
(iii). The Appellant should bring with him all the connected records, such as, 6(1) application, 19(1) application, copy of the information furnished by the PIO, if any, etc.

All Appeals will be decided on the basis of material placed before the Commission and as per the merits of the case.
Given under the seal of the Telangana Information Commission on this, the 13th day of May, 2026.

Encl:- (i). 6(1) application; (ii). Blank Affidavit form.

// BY ORDER //
ASO to SIC-PVSR

To
Appellant : Sri A. Saidulu, S/o. Ramulu, Chennaram Vill, Nelakondapally Mandal, Khammam District-507160.

Respondent: 1) The Public Information Officer (U/RTI Act,2005)
The Gram Panchayat Secretary, Chennaram Vill, Nelakondapally Mandal, Khammam District.
2) The First Appellate Authority (U/RTI Act, 2005)
O/o. the Mandal Parishad Development Officer, MPP, Nelakondapally Mandal, Khammam District.

Note: In case the 6(1) application was transferred to some other PIO U/s. 6(3) of RTI Act, a copy of this notice should be transmitted by the PIO mentioned above, to the deemed PIO to also attend the hearing in the Commission on the said date and time.

ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.
నిబంధనల ప్రకారం దరఖాస్తు రుసుము చెల్లించిన తర్వాత సమాచారం ఎన్ని పేజీలు ఉందో, దానికి ఎంత రుసుము కట్టాలో స్పష్టంగా చెప్పాల్సిన బాధ్యత ఉన్నా కార్యదర్శి పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. దీంతో విసిగిపోయిన బాధిత సామాజిక కార్యకర్త రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై తీవ్రంగా స్పందించిన కమిషన్. చెన్నారం పంచాయతీ కార్యదర్శికి నోటీసులు జారీ చేస్తూ, జూన్ 4వ తేదీన పూర్తి రికార్డులతో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. నిబంధనల ప్రకారం సమాచారం ఎందుకు ఇవ్వలేదో కమిషన్ ముందు వివరణ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. చట్టాన్ని పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి, ఇలా అవగాహన రాహిత్యంతో వ్యవహరించే అధికారులపై కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# పంట వ్యర్థాలను కాల్చడం నేరం.

### మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్

#### - వరిగడ్డి తగులబెడితే భూసారం దెబ్బతింటుంది.. ప్రత్యామ్నాయాలు పాటించాలి



**ఎల్కతుర్తి/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):**పొలాల్లో పంట వ్యర్థాలను కాల్చడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల భూసారం క్షీణిస్తుందని మండల వ్యవసాయ అధికారి మంద రాజ్ కుమార్ తెలిపారు. మండలంలోని చింతలపల్లి, సూరారం గ్రామాల్లో మంగళవారం రైతులకు పంట వ్యర్థాల నిర్వహణ, పంటల మార్పిడిపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో వరి కొయ్యలు, వరిగడ్డి, పత్తి కట్టె, మొక్కజొన్న చొప్పలను తగులబెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. వ్యర్థాలను కాల్చడం వల్ల ఆ మంటలు పక్క పొలాలకు వ్యాపించి పెద్ద ఎత్తున అగ్నిప్రమాదాలు జరిగే అవకాశముందని హెచ్చరించారు. దీనివల్ల పంట ఉత్పత్తులు నష్టపోవడంతో పాటు పశువులకు, మనుషులకు ప్రాణసంకటంగా మారుతుందన్నారు. అంతేకాకుండా, మంటల వేడికి నేలలో ఉండే మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాములు చనిపోయి నేల ఆరోగ్యం దెబ్బతింటుందని, వాతావరణ కాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వ్యర్థాలను కాల్చడానికి బదులుగా వేస్ట్ డీకంపోజర్ లేదా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వంటివి వాడి వాటిని ఎరువుగా మార్చుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి భూసారాన్ని పెంపొందించుకోవాలని, పంటల మార్పిడిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ఎం. పున్నంచందర్, జె. బాబు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అభివృద్ధి పథంలో తెలంగాణ

### అమరుల స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధి ఆవిర్భావ వేడుకల్లో మంత్రి తుమ్మల

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)** ప్రజాపాలనతో తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అమరుల త్యాగాల పునాదులు మీద తెలంగాణ అవతరించిందని తెలిపారు. అమరుల త్యాగాల స్ఫూర్తిగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనను అందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతి మైదానంలో జాతీయ జెండాను మంత్రి తుమ్మల ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సశ్యశ్యామలంగా మారేలా సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో ఉద్యాన పంటల సాగులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అగ్ర స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. దేశానికే తలమానికంగా మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెంలో స్థాపించామని ప్రస్తావించారు. ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసి ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశామని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధి పారిశ్రామిక ప్రగతి కోసం రహదారులు నిర్మిస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడించారు.

# మధిరలో తెదేపా ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**మధిర/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):**
మధిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మల్లాది హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కలిసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతంతో పాటు జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలాపించారు. ఈ సందర్భంగా నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మల్లాది హనుమంతరావు, మార్నిడి పుల్లారావు, బోడెపూడి రేవతి, ములకలపల్లి వినయ్ కుమార్ మాట్లాడుతూ.. నాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు మద్దతు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు.
ప్రాంతాలుగా విడిపోయినా తెలుగువారమంతా ఒక్కటేనని, మన గౌరవాన్ని కాపాడుకోవాలని వారు



ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోనే పుట్టిన తెలుగుదేశం పార్టీ ఒక జాతీయ పార్టీ అని, ఏ రాష్ట్రంలోనైనా పోటీ చేసే హక్కు పార్టీకి ఉందన్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకాన్ని వీలైనంత త్వరగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ వేడుకల్లో పార్టీ పట్టణ కార్యదర్శి చట్టు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గద్దల ప్రకాశరావు, పాశం రామనాథం, వీరవల్లి కోటేశ్వరావు, మన్నేపల్లి రత్నకుమారి, కోనేరు రాణి పాల్గొన్నారు. గద్దం



మల్లిఖార్జున, అనుమోలు సతీష్, వేల్పుల కొండ, గద్దల నరసింహారావు, కేశవపట్నం రామయ్య, చెన్నం స్వామి, కృష్ణమూర్తి, పోతినేని కోటేశ్వరావు, ఈదర వెంకటేశ్వరావు, వట్టికొండ మోహనరావు, సిరపంగి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళతాం

### అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది -ఢిల్లీలో తెలంగాణ అవరతణ వేడుకల్లో నితిన్ నబీ

**న్యూఢిల్లీ,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**తెలంగాణ అభివృద్ధి, సంస్కృతిని ముందుకు తీసుకువెళ్లాలన్నది బీజేపీ సంకల్పం' అని బిజెపి జాతాయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. పీఎం కిసాన్ యోజన ,ముద్ర లోన్లు, జన్ ధన్ ఖాతాలు అందించాం. మౌలిక వసతులు,రోడ్లు,రహదారులు,రైల్వేలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. వికసిత భారత్ కావాలంటే వికసిత తెలంగాణ కావాలి. ఒక అవినీతి పరుడు చేతుల్లోంచి మరో అవినీతి పరుడి చేతుల్లోకి వెళ్ళింది. తెలంగాణ కలలును సాకారం చేస్తాం' అని నితిన్ నబీన్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలానే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి,



టీజీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ రాష్ట్ర ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడుతూ, అభివృద్ధి పథంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చిన్న రాష్ట్రాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు ఏర్పాటు చేశాం. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ఏర్పాటుకు




మద్దతు ఇచ్చాం. తెలంగాణ అమరవీరులకు నివాళు లర్పిస్తున్నా. అమరవీరుల కలలు కన్న రీతిలో ఇంకా రాష్ట్రం వెనుకబడి ఉంది. చిన్నమ్మ సుష్మా స్వరాజ్ తెలంగాణ ఏర్పాటుకు కృషి చేశారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారు అధికారంలో ఉన్నారు. రాష్ట్రా అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్ ఏర్పాటు సమయంలో జార్ఖండ్ ఏర్పాటు కానివ్వం అన్నవారే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నారు.

# దామెరలో పార్టీలకతీతంగా ఆవిర్భావ వేడుకలు

**ఎల్కతుర్తి/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):**




మండల పరిధిలోని దామెర గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులంతా హాజరయ్యారు. రాజకీయాలకు తావులేకుండా, వివిధ పార్టీల నేతలు, ప్రజలు ఒకేతాటిపైకి వచ్చి సోదరభావంతో ఈ వేడుకల్లో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మంకని పద్మ వీరాలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నివాళులర్పించారు. స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటాలను, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం గ్రామస్తులంతా కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ ఆనందోత్సాహాల మధ్య ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. గ్రామాభివృద్ధికి అందరూ రాజకీయ విభేదాలను పక్కనబెట్టి సమిష్టిగా కృషి చేయాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, పంచాయతీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మండలవ్యాప్తంగా ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

### - పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, రక్షణ పరికరాల పంపిణీ.

**ఎలుకతుర్తి/జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):**



మండల కేంద్రంతో పాటు దామెర, చింతలపల్లి, బావుపేట, కేశాపూర్, కోతులనడుమ, గోపాల్‌పూర్, ఇంద్రనగర్ తదితర గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. కాగా, వీరనారాయణపూర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ పుల్లూరి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు క్లీన్ అండ్ గ్రీన్ జాకెట్లు, గ్లౌస్‌లు, పారలు, షూస్ , హెల్త్ మెటీరియల్‌ను సర్పంచ్ అందజేశారు. అనంతరం పంచాయతీ పాలకవర్గం సభ్యులు స్థానిక నర్సరీని, మొక్కల పెంపకాన్ని, కంపోస్ట్ షెడ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ ప్రగతికి అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది , గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**బయ్యారం/,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**



బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు బయ్యారం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాతా గణేష్ పిలుపు మేరకు బయ్యారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం జాతీయ పతాకం,తెలంగాణ పతాకాలను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు,త్యాగాలు,పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు.రాష్ట్ర అభివృద్ధి,ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ ప్రత్యేకత, సంస్కృతి,ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# అమరుల తాగ్యాల వల్లే తెలంగాణ సాధ్యం..

### -సర్పంచ్ సరస్వతి రాందాస్ నాయక్.



**బయ్యారం/,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బయ్యారం మండలం సింగారం గ్రామపంచాయతీలో మంగళవారం స్థానిక సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సర్పంచ్ జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ స్వరాష్ట్ర స్వప్నం సాకారమైన శుభదినం,కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం,అమరుల ఆశయాలకు అక్షరరూపం తెలంగాణ,సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్లుగా సమానత్వం,సామాజిక న్యాయం రెండు రెక్కలుగా ప్రజాపాలనలో తెలంగాణ ప్రగతి శిఖరాల వైపు సాగిపోతూ దేశానికే దిక్సూచిగా నిలుస్తోన్న శుభ సందర్భంగా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ కార్యదర్శి సరిత,ఉప సర్పంచ్ చుంచు మమతా, వార్డు సభ్యులు చుంచు అనిల్ కుమార్,చెరుకుపల్లి మనిషా,బాధవత్ లల్యా నాయక్,గుగులోత్ భద్రు నాయక్,బానోత్ సరిత,సపవత్ అనిత, స్కూల్ చైర్మన్ గుగులోత్ స్వరూప మహేష్,స్కూల్ హెచ్‌ఎం మాలోత్ శంకర్,స్టాప్,అంగన్వాడి టీచర్ గంగవత్ పద్మ,ఆశ వర్కర్ చుంచు సుగుణ,మాజీ ఎంపీటీసీ గంగావత్ గోపాల్ నాయక్,కొత్తపల్లి సీతారాములు,ఇందిరమ్మ కమిటీ సభ్యులు చాట్ల వెంకన్న,చెరుకుపల్లి రవి,నాయకులు మంగీలాల్,భిక్కు, వీరన్న,వెంకన్న, బాలకృష్ణ,సంతోష్, హరీష్,గోపి, ఉప్పలయ్య,వల్మా,గ్రామ పంచాయతీ సిబ్బంది మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కోయగూడెంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు.

-జెండా ఆవిష్కరించిన సర్పంచ్ లింగా నాయక్.



**బయ్యారం/,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలో కోయగూడెం గ్రామ పంచాయతీలో తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోత్ లింగా నాయక్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అమరుల త్యాగాలు ప్రజల ఆకాంక్షలు ఉద్యమస్ఫూర్తితో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి. ప్రతి యువకుడికి అవకాశాలు లభించాలనీ, తెలంగాణ నిర్మాణంలో మనమంతా భాగస్వామ్యం కావాలి. దశాబ్దాల కల తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం. 2014 జూన్ 2న ఆ కల సాకారమైంది. దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. దీని వెనుక ఎందరో మహామహుల పోరాటం, శ్రీకాంతచారి లాంటి యువకుల ప్రాణత్యాగం ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుంది రాంబాబు, సెక్రటరీ భూక్యా వెంకటేష్, వార్డు సభ్యులు గుగులోత్ వీరు నాయక్, గుగులోత్ మంగీలాల్, సూర్నపాక ఎర్రమ్మ, పూసం అరుణ, దారావత్ భాజ్య, మాజీ సర్పంచ్ గుంట కాంతారావు, పూసం వెంకటేశ్వర్లు, తాటి రాణి, యస్.కే. ఇస్మాయిల్, ఆశ వర్కర్స్, అంగన్వాడీ టీచర్స్, తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు

# బయ్యారంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..



**బయ్యారం,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దీపిక, తాహసిల్దార్ కార్యాలయంలో నాగరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా. విజయ్ కుమార్, పోలీస్ స్టేషన్ లో సీఐ రవీందర్, ఫారెస్ట్ కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ రవి కిరణ్, యునాని వైద్యాశాలలో డా. శంకర్, సోసైటీ కార్యాలయంలో చైర్మన్ మూల మధుకర్ రెడ్డి జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం మండల ప్రజలందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సునీల్, ఆర్ఐ సందీప్, ఉపేందర్, వెంకన్న, గౌస్ పాషా, ప్రసాద్, చిరంజీవి, ప్రభాకర్, వివిధ పార్టీల నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జగ్గుతండ జిపిలో వైభవంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..



**బయ్యారం/,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగ్గుతండా గ్రామపంచాయతీ ఆవరణలో వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. పంచాయతీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుంజ వీరాస్వామి, వార్డ్ సభ్యులు సావిత్రి, యాకేష్, రూపేష్, పావని, స్వాతి, దుర్గారావు, లలిత, కవిత, రాఘవేంద్ర రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ యువత, అంగన్వాడి టీచర్లు, వర్కర్లు ఆశా కార్యకర్తలు 108 సిబ్బంది గ్రామ మహిళా సంఘ సభ్యులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నందనం సొసైటీలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**ఐనవోలు/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):**
హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని నందనం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాక్స్ చైర్మన్, మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సుదీర్ఘ ఉద్యమాలు, ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల బలిదానాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాకారమైందని గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావుల పాత్ర అమోఘమని కొనియాడారు. అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువలేదని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చంద్రరావు, డైరెక్టర్లు బుచ్చిరెడ్డి, బిర్రు పద్మ, ఎలేంద్ర రామచంద్రయ్య, ఎశబ్ రాజ్‌కుమార్, సంపత్ రావు, చింత బాబు సొసైటీ సీఈఓ సంపత్, నందనం గ్రామ సర్పంచ్ రాజు, స్థానిక గ్రామ నాయకులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# సంతులాల్ పోడు తండలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

-ఎందరో మహనీయుల ప్రాణ త్యాగ ఫలితంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. -గుగులోత్ మణి.



**బయ్యారం/జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం సంతులాల్ పోడ్ తండ గ్రామపంచాయతీలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ పురస్కరించుకొని గ్రామపంచాయతీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సంతులాల్ పోడ్ తండా సర్పంచ్ గూగులోత్ మణి జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమానికి హాజరైన గ్రామ కార్యదర్శికి శాలువా తో సన్మానించడం జరిగింది గ్రామం పంచాయతీ సిబ్బంది అయినా కోటయ్య. హమీద్. ఉప్పలమ్మ వారిని కూడా శాలువతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గువులో సర్పంచ్ మణి మాట్లాడుతూ ఎందరో మహనీయుల ప్రాణ త్యాగాల ఫలితంగానే ఏర్పడ్డ ఈ తెలంగాణ రాష్ట్రం 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలో అడుగుపెడుతున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సంతులాల్ పోడ్ తండ గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మట్ల కిషోర్ గ్రామ కార్యదర్శి శ్రీరామకృష్ణ వార్డ్ మెంబర్స్. ఆశ వర్కర్స్. అంగన్వా టీచర్స్. గ్రామ వివో ఏ. స్కూల్ సిబ్బంది. గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# బయ్యారం జీపీ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.



**బయ్యారం/,జూన్ 2.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూడ ప్రజలంతా కలిసికట్టుగా పోరాడి సాధించుకున్న రాష్ట్రం 11ఏళ్లు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ దీపిక, ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా, వార్డు సభ్యులు, పెద్దినేని శాంత, బట్టు ఉమాదేవి, బానోత్ సునీత, శీలం సరోజన, ములుకురి వీరారెడ్డి, కిసాన్ జిల్లా ప్రధానకార్యదర్శి పెద్దీనేని వెంకటరశ్వరరావు, కొండ్రేడ్డి సోమిరెడ్డి, తగిర సత్యనార్యాయణ రెడ్డి, నందగిరి భద్రయ్య, తాటి జనార్ధన్, మండా రేణుక, నందిపాటి బవాణి, ఆకునూరి సూర్యనారాయణ, రామగిరి వెంకటేశ్వర్లు, లింగయ్య, బీరెడ్డి శ్రీనివాస్, మాడే బాబు, పులి మల్లయ్య, నద్దునురి లింగయ్య, నిమ్మల సోమిరెడ్డి, బీమనపల్లి యాదగిరి, కంకటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట పాక్స్ లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

- అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం - చైర్మన్ రాజేష్ ఖన్నా

**వర్ధన్నపేట/ జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):**



మహనీయుల సుదీర్ఘ పోరాటాలు, బలిదానాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్ర రక్షణ, అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వర్ధన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణ కేంద్రంలోని పాక్స్ కార్యాలయ ఆవరణలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, వారి ఆశయ సాధనకు కృషి చేయడం ప్రతి తెలంగాణ పౌరుడి కనీస బాధ్యత అని కొనియాడారు. జెండా ఆవిష్కరణ అనంతరం అక్కడికి విచ్చేసిన రైతులకు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేసి రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ వైస్ చైర్మన్ కుల్లా సోమన్న, సంఘం డైరెక్టర్లు ప్రత్యేకంగా పాల్గొని ముఖ్యాంశాలపై మాట్లాడారు. సొసైటీ సీఈఓ వెంకటయ్య, సిబ్బంది ప్రసాద్, కరుణాకర్ స్థానిక సహకార సంఘ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరికొయ్యకాళ్ల దహనం.. భూసారానికి ముప్పు

సూక్ష్మజీవ సంపద నాశనం.. తగ్గనున్న దిగుబడులు -పర్యావరణ కాలుష్యంతో పాటు రూ.5 వేల జరిమానా కూడా





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 2 (జర్నలిస్ట్ వార్త):**
వరి కోత పూర్తయిన తర్వాత పొలాల్లో మిగిలిపోయే కొయ్యకాళ్లను కాల్చివేయడం రైతులకు సులభమైన మార్గంగా కనిపించినప్పటికీ, దీని వల్ల భూమి సారవంతతకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ శాఖ హెచ్చరిస్తోంది. పంట అవశేషాలను నేలలో కలపాల్సిందిపోయి అగ్నికి ఆహుతి చేయడం వల్ల నేలలోని విలువైన సూక్ష్మజీవ సంపద నశించడంతో పాటు పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోందని వ్యవసాయ అధికారి రాజేష్ తెలిపారు. పంట అవశేషాలు సహజ ఎరువులుగా మారి భూసారాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు. అయితే వాటిని కాల్చడం వల్ల నేలలోని పోషకాలు, సూక్ష్మజీవులు నాశనమై భూమి ఉత్పాదకత క్రమంగా తగ్గిపోతుందని చెప్పారు. దీని ప్రభావం భవిష్యత్తు పంటల దిగుబడులపై కూడా పడుతుందని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని పెంచినా, నేల సహజ సారం కోల్పోతే ఆశించిన ఫలితాలు రావని వెల్లడించారు. ఇదిలా ఉండగా, వరికొయ్యకాళ్ల దహనం కారణంగా గాలిలో పొగ, కాలుష్యకారక వాయువులు విడుదలై పర్యావరణానికి హాని కలుగుతోందన్నారు. ప్రజల ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, పంట వ్యర్థాల నిర్వహణపై సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. పంట అవశేషాలను రోటవేటర్లు, బేలర్లు వంటి వ్యవసాయ యంత్రాల సహాయంతో నేలలో కలపడం లేదా ఇతర ఉపయోగాలకు వినియోగించడం ఉత్తమ మార్గమని సూచించారు. ఎవరైనా పంట వ్యర్థాలను తగలబెడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారులు లేదా పంచాయతీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ నిబంధనల ప్రకారం పంట అవశేషాలను కాల్చిన వారిపై రూ.5 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. భూమిని కాపాడితేనే భవిష్యత్ వ్యవసాయం బలోపేతం అవుతుందని, రైతులు వరికొయ్యకాళ్ల దహనాన్ని పూర్తిగా మానుకోవాలని వ్యవసాయ శాఖ పిలుపునిచ్చింది.